యుగాలు మారినా... కాలం దాటినా... తప్పని దండన!

# హనుమాన్: ధర్మ రక్షకుడు

## The Guardian of Dharma



రచన: గోపరాజు వెంకట ఆదిత్య

శ్రీ గాయత్రి పబ్లిషర్స్

# హనుమంతుని కథ

---


రచయిత: గోపరాజు వేంకట ఆదిత్య



శ్రీ గాయత్రి పబ్లిషర్స్





Email: g.auditya@gmail.com



Sri Gayathri Publishers

Printed in India

"యుగాలు మారినా, కాలచక్రం ఎన్ని మలుపులు తిరిగినా... ధర్మం ఎప్పుడూ అధర్మంపై విజయం సాధిస్తుంది. సత్యం వైపు నిలిచే శక్తులు కాల గమనాన్ని సైతం శాసించగలవని, కాలం దాటినా సరే భగవంతుని సంకల్పం దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేసి తీరుతుందని చాటిచెప్పే ఉత్కంఠభరితమైన కథనమే ఈ హనుమంతుని కథ.

- **గోపరాజు వేంకట ఆదిత్య**

యుద్ధభూమి అంతా రక్తసిక్తమై ఉంది. లంకలో రామ రావణ సంగ్రామం ఉధృతంగా సాగుతోంది. ఒకవైపు వానర సేనల జయజయధ్వానాలు, మరోవైపు రాక్షసుల ఆక్రందనలు మిన్నంటుతున్నాయి. ఆ భీకర రణరంగంలో కాలసూరుడు అనే రాక్షసుడు ప్రళయకాల యముడిలా విరుచుకుపడుతున్నాడు. వాడు అసాధారణ బలశాలి. పైగా వాడికో విచిత్రమైన వరం ఉంది— శ్రీరాముడి బాణం తప్ప ఈ సృష్టిలో ఏ శక్తి కూడా వాడిని సంహరించలేదు!

ఆ సమయంలో, రుద్రాంశ సంభూతుడైన ఆంజనేయుడు కాలసూరుడికి ఎదురుపడ్డాడు. కాలసూరుడు గర్జన చేస్తూ హనుమంతుడిపైకి లంఘించాడు. హనుమంతుడు లక్ష్మణాగ్రజుని స్మరిస్తూ, తన వజ్రసమానమైన పిడికిలిని బిగించి, కాలసూరుడి వక్షస్థలంపై ఒక్క దెబ్బ వేశాడు.

ఆ దెబ్బకు భూమి కంపించింది. హనుమంతుడి దెబ్బ తట్టుకోవడం ఎవరి తరం? కాలసూరుడు రక్తం కక్కుకుంటూ లంక నుండి ఆకాశమార్గంలో వేలాది కిలోమీటర్ల దూరంలో ఉన్న హిమాలయాల వైపు దూసుకుపోయాడు. ఒక మంచు పర్వతాన్ని బలంగా ఢీకొట్టి, తీవ్రమైన గాయాలతో అక్కడే కుప్పకూలిపోయాడు.

వరప్రభావం వల్ల వాడు మరణించలేదు కానీ, ప్రాణాలు కోల్పోయినట్టుగా సుదీర్ఘమైన, గాఢమైన నిద్రలోకి జారుకున్నాడు.

కాలక్రమేణా లంకాయుద్ధం ముగిసింది. రావణ సంహారం జరిగింది. అధర్మం నశించి ధర్మం గెలిచింది. అయోధ్యకు పట్టాభిషేకం జరిగాక ఒక రోజు... శ్రీరాముడు ఏకాంతంగా కూర్చుని ఆలోచిస్తున్నాడు. తన దివ్యదృష్టితో కాలసూరుడు ఇంకా జీవించే ఉన్నాడని, వాడు హిమాలయాల్లో నిద్రాణమై ఉన్నాడని రాముడు గ్రహించాడు. వాడిని అంతం చేయడం తన విధి. కానీ, ఇప్పుడు కాలం దాటిపోయింది.

రాముడు హనుమంతుడిని పిలిపించాడు.

"ఆంజనేయా!" అన్నాడు రాముడు గంభీరంగా. "లంకాయుద్ధం ముగిసినా, అధర్మపు వేరు ఒకటి ఇంకా సజీవంగానే ఉంది. నీ పిడికిలి దెబ్బకు హిమాలయాల్లో పడిన కాలసూరుడు ఇంకా చావలేదు. నా బాణం తప్ప వాడిని ఏదీ అంతం చేయలేదు. కానీ, ఇప్పుడు నేను వాడిని వెతుక్కుంటూ వెళ్లే సమయం కాదు. రాబోయే కాలంలో ధర్మానికి హాని కలగకూడదు. అందుకే నీకో పరమ రహస్యమైన కార్యాన్ని అప్పగిస్తున్నాను."

రాముడు తన వేలికున్న ఒక దివ్యమైన, కాంతివంతమైన అంగుళీకాన్ని (ఉంగరాన్ని) తీసి హనుమంతుడికి ఇచ్చాడు.

"ఇది సామాన్యమైన ఉంగరం కాదు హనుమా! ఇది కాలద్వారాలను తెరిచి, మనుషులను కాలంలో ప్రయాణింపజేసే 'కాల ముద్రిక'. నువ్వు చిరంజీవివి. రాబోయే యుగాలలో ఎప్పుడైనా ఆ రాక్షసుడు మేల్కొంటే... వాడిని ఈ ఉంగరం సహాయంతో నా వద్దకు తీసుకురా. ఈ విశ్వంలో ధర్మ సంస్థాపన జరగాలి." హనుమంతుడు ఆ అంగుళీకాన్ని కళ్ళకద్దుకుని, రాముని ఆజ్ఞను శిరసావహించాడు.

సరిగ్గా ఇరవై వేల సంవత్సరాలు గడిచిపోయాయి! కాలం కలియుగంలోకి, అంటే **2026** వ సంవత్సరంలోకి అడుగుపెట్టింది. ప్రపంచం అత్యాధునిక సాంకేతికతతో మారిపోయింది. కానీ హిమాలయాల గుహలలో, బాహ్య ప్రపంచానికి దూరంగా, చిరంజీవి అయిన ఆంజనేయుడు లోతైన ధ్యాన సమాధిలో ఉన్నాడు. తన దివ్యశక్తితో ప్రపంచ గమనాన్ని గమనిస్తూనే ఉన్నాడు.

అదే సమయంలో... హిమాలయాలలోని ఒక మంచు పర్వతం ఒక్కసారిగా పగుళ్లు ఇచ్చింది. ఇరవై వేల ఏళ్ల సుదీర్ఘ నిద్ర నుండి కాలసూరుడు మేల్కొన్నాడు! వర్తమాన కాలంలో వాడి గాయాలన్నీ మానిపోయాయి, శరీరం మునుపటిలా దృఢంగా

తయారైంది. కళ్ళు తెరిచిన కాలసూరుడు చుట్టూ చూసి ఆశ్చర్యపోయాడు. యుగాలు మారిపోయాయని వాడు గ్రహించాడు. కానీ వాడిలోని రాక్షస బుద్ధి మాత్రం మారలేదు. ఆకలితో, అహంకారంతో వాడు హిమాలయాల చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లోని అమాయక ప్రజలను హింసించడం, చంపడం ప్రారంభించాడు.

ప్రజల ఆక్రందనలు ధ్యానంలో ఉన్న హనుమంతుడికి వినిపించాయి. దివ్యదృష్టితో చూసిన మారుతి... "కాలసూరుడు మేల్కొన్నాడు! ప్రభువు మాట నెరవేరే సమయం వచ్చింది" అని తలచి, క్షణాల మీద వాయువేగంతో కాలసూరుడి ముందుకు వచ్చి నిలిచాడు.

"కాలసూరా! ఆగు!" హనుమంతుడి గర్జనకు పర్వతాలు ప్రతిధ్వనించాయి. "నీ పాపాలు పండాయి. శ్రీరాముడి బాణం నీ కోసం వేచి చూస్తోంది!"

కాలసూరుడు భయపడలేదు. వాడి కళ్ళు హనుమంతుడి చేతిలో మెరుస్తున్న శ్రీరాముడి అంగులీకంపై పడ్డాయి. రాక్షస విద్యల వల్ల కాలసూరుడికి ఆ ఉంగరం యొక్క 'కాల ప్రయాణ' శక్తి గురించి తెలుసు.

"నన్ను రాముడి వద్దకు తీసుకెళ్తావా? లేదు... నేనే ఈ ఉంగరంతో గతంలోకి వెళ్లి, అసలు రాముడే లేని కాలానికి వెళ్లి రాజవుతాను!" అని మనసులో అనుకున్నాడు.

హనుమంతుడు వాడిని పట్టుకోవడానికి ముందుకు ఉరకగా, కాలసూరుడు అత్యంత చాకచక్యంగా, తన మాయా శక్తితో హనుమంతుడి చేతిలోని ఉంగరాన్ని లాక్కున్నాడు. వెంటనే దాన్ని గాల్లో తిప్పి, గతంలోకి వెళ్లేందుకు కాలద్వారాన్ని (Time Portal) తెరిచాడు.

ఆకాశంలో ఒక భయంకరమైన కాంతి సుడిగుండం ఏర్పడింది. కాలసూరుడు అందులోకి దూకబోయాడు. కానీ శ్రీరాముడు ఆ ఉంగరానికి ఒక కఠినమైన నియమాన్ని విధించాడు—"ఈ ఉంగరం పనిచేయాలంటే, ఉంగరంతో పాటు హనుమంతుడు కూడా అక్కడ ఉండాలి."

హనుమంతుడు దూరంగా ఉండటంతో, కాలద్వారం కాలసూరుడిని లోపలికి రానివ్వలేదు. సరికదా, ఆ కాలచక్రం యొక్క తీవ్రమైన శక్తికి తట్టుకోలేక, కాలసూరుడు పెద్దగా అరుస్తూ బయటకు విసిరివేయబడ్డాడు.

క్రింద పడబోతున్న కాలసూరుడిని హనుమంతుడు గాల్లోనే గట్టిగా పట్టుకున్నాడు. వాడి చేతిలో నుండి ఉంగరాన్ని తిరిగి తీసుకున్నాడు.

"మూర్ఖుడా! శ్రీరాముడి సంకల్పాన్ని దాటడం ఎవరి తరం కాదు. రా, మనమిద్దరం కలిసి వెళ్దాం!" అంటూ హనుమంతుడు ఉంగరాన్ని గాల్లో తిప్పాడు. ఈసారి ఇద్దరూ కలిసి ఆ కాలద్వారంలోలోకి ప్రవేశించారు. కాలచక్రం వెనక్కి తిరిగింది.

క్షణాల వ్యవధిలో వారు ఇరవై వేల ఏళ్ల వెనక్కి... లంకాయుద్ధం జరుగుతున్న కాలానికి చేరుకున్నారు. గతంలో అడుగుపెట్టగానే ఒకే కాలంలో ఇద్దరు హనుమంతులు, ఇద్దరు కాలసూరులు ఉండటం వల్ల కాల గమనంలో ఒక సూక్ష్మమైన అలజడి (Chrono-Ripple) ఏర్పడింది. అప్పటికే ఆ కాలంలో 'గత కాలపు హనుమంతుడు', 'గత కాలపు కాలసూరుడు' యుద్ధ రంగంలో పోరాడుతున్నారు.

భవిష్యత్తు నుండి వచ్చిన కాలసూరుడు అత్యంత వేగంగా హనుమంతుడి పట్టు నుండి తప్పించుకుని, నేరుగా రావణాసురుడి అంతఃపురానికి పరుగుతీశాడు.

"లంకేశ్వరా! మహాప్రభూ!" అంటూ రావణుడి పాదాలపై పడ్డాడు. "నేను భవిష్యత్తు నుండి వస్తున్నాను ప్రభూ! ఇరవై వేల ఏళ్ల

భవిష్యత్తు నుండి వస్తున్నాను! రామచంద్రుని చేతిలో మనకు ఓటమి తప్పదు. మన లంక సర్వనాశనం కాబోతోంది! హనుమంతుడు నన్ను కాల గమనంలో ఇక్కడికి తీసుకువచ్చాడు. నమ్మండి ప్రభూ!" అని నెత్తీ నోరూ బాదుకున్నాడు.

రావణుడు వాడిని పై నుంచి క్రిందికి చూశాడు. భవిష్యత్తు కాలసూరుడి శరీరంపై ఎటువంటి గాయాల గుర్తులు లేవు (ఎందుకంటే ఇరవై వేల ఏళ్ల నిద్రలో వాడి గాయాలన్నీ మానిపోయాయి). యుద్ధభూమిలో శత్రువులతో పోరాడి గాయపడకుండా, ఇలా పిరికివాడిలా మాట్లాడుతున్న వాడిని చూసి రావణుడికి తీవ్ర కోపం వచ్చింది.

"హాహాహా! ఓటమా? ఆ మానవుడు రాముడు నిన్ను భయపెట్టినట్టున్నాడు. శరీరంపై ఒక్క గాయం కూడా లేని నువ్వు నా సైనికుడివి కావు! ఇది ఆ రాముడు నన్ను భయపెట్టడానికి పంపిన మాయా నాటకం! వీడిని తీసుకువెళ్లి కారాగారంలో బంధించండి!" అని రావణుడు ఆజ్ఞాపించాడు.

అలా భవిష్యత్తు కాలసూరుడు చెరసాలపాలయ్యాడు. మరోవైపు, భవిష్యత్తు నుండి వచ్చిన హనుమంతుడు ఎంతో బుద్ధిమంతుడు, మేధావి. ఒకే కాలంలో ఇద్దరు హనుమంతులు తిరిగితే సృష్టి నియమాలకు విరుద్ధమని గ్రహించి, ఆయన వానర

సేన కంట పడకుండా అదృశ్య రూపంలో నేరుగా శ్రీరాముడి వ్యక్తిగత శిబిరానికి చేరుకున్నాడు.

తన ముందుకు వచ్చిన భవిష్యత్తు హనుమంతుడిని చూసి రాముడు మందహాసం చేశాడు. త్రికాలజ్ఞుడైన ఆ రాఘవుడికి జరిగిందంతా ముందే తెలుసు. హనుమంతుడు రాముని పాదాలకు ప్రణామం చేసి, "ప్రభూ! మీ ఆజ్ఞ ప్రకారం భవిష్యత్తు నుండి ఆ కాలసూరుడిని ఇక్కడికి తీసుకువచ్చాను. కానీ వాడు నా పట్టు నుండి తప్పించుకుని రావణుడి వద్దకు వెళ్ళాడు. ఇప్పుడు ఈ కాలంలో నా రూపం, వాడి రూపం రెండేసి ఉన్నాయి. దీనివల్ల కాలానికి ఏ హాని జరగకూడదు. నా కర్తవ్యమేమిటో సెలవివ్వండి" అని ప్రార్థించాడు.

శ్రీరాముడు హనుమంతుడి భుజంపై చేయి వేసి, ఆంజనేయా! నీ వివేకం అమోఘం. కాల వైరుధ్యాన్ని నివారించడానికి నువ్వు ప్రస్తుతానికి ఏ యుద్ధంలోనూ పాల్గొనవద్దు. ఇక్కడే నా శిబిరంలో ఒక రహస్య ప్రదేశంలో యోగసమాధి లో కూర్చో. మిగిలిన కార్యాన్ని నేను చూసుకుంటాను," అని ఆజ్ఞాపించాడు.

స్వామి ఆజ్ఞ ప్రకారం భవిష్యత్తు హనుమంతుడు ప్రశాంతంగా యోగసమాధిలోకి జారుకున్నాడు. రావణుడి కారాగారంలో బంధింపబడిన భవిష్యత్తు కాలసూరుడు ఆలోచనలో

పడ్డాడు. తను లంకను రక్షించాలని అంత నిజం చెప్పినా రావణుడు నమ్మలేదు సరి కదా, కారాగారంలో వేశాడు. వాడికి మెల్లగా జ్ఞానోదయం (Enlightenment) అయింది. "అధర్మం వైపు నిలిచినప్పుడు కాలం కూడా కలిసి రాదు. రావణుడి పతనం శాశ్వతం. విధిని మార్చడం ఎవరి తరం కాదు. నేను మళ్లీ యుద్ధభూమికి వెళ్లి అధర్మం వైపు పోరాడటం వృథా," అని గ్రహించాడు.

వాడు కారాగారం నుండి ఎలాగోలా తప్పించుకున్నాడు. కానీ వాడు యుద్ధభూమికి వెళ్లలేదు. ఒక ప్రశాంతమైన చోటు చూసుకుని, ధ్యానంలో కూర్చుండిపోయాడు. "ఈ కాలంలో ఉన్న నా 'గత రూపం' ఎప్పుడైతే మరణిస్తుందో, అప్పుడు భవిష్యత్తు నుండి వచ్చిన నేను కూడా శూన్యంలో కలిసిపోతాను. అదే నాకు మోక్షం," అని వాడు నిశ్చయించుకున్నాడు.

అదే సమయంలో, రణరంగంలో అసలైన **గత కాలపు కాలసూరుడు** వానరసేనను హింసిస్తూ భీకరంగా పోరాడుతున్నాడు. వాడి అహంకారం మిన్నంటుతోంది. అది గమనించిన శ్రీరాముడు స్వయంగా రంగంలోకి దిగాడు.

రాముడు తన కోదండాన్ని వంచి, దివ్యమైన మోక్షబాణాన్ని సంధించాడు. రామబాణం వాయువేగంతో దూసుకువెళ్లి, గత

కాలపు కాలసూరుడి వక్షఃస్థలాన్ని చీల్చింది. వాడు పెద్దగా అరుస్తూ రక్తం కక్కుకుని రణరంగంలో కుప్పకూలి మరణించాడు.

భవిష్యత్తు కాలసూరుడు శూన్యంలో అదృశ్యమయ్యే ఆ చివరి క్షణాలలో, వాడి అంతరంగంలో భయంకరుడైన రాక్షసుడు పూర్తిగా నశించిపోయాడు. ఇరవై వేల సంవత్సరాల అహంకారం, క్రోధం మరియు రాక్షస ప్రవృత్తి క్షణ కాలంలో కరిగిపోయాయి. తన గత రూపం రామబాణానికి గురవుతున్న దృశ్యాన్ని చూస్తూ, వాడు కళ్ళు మూసుకుని శ్రీరామచంద్రుడి దివ్య మంగళ రూపాన్ని మనసులో ధ్యానించాడు. "ప్రభూ! రావణుడి పక్షాన నిలిచి నేను చేసిన పాపాలకు, యుగాల తరబడి అనుభవించిన నా సుదీర్ఘ నిద్రకు నేడు మోక్షం లభించింది. కాలచక్రం కంటే, కాలధర్మం కంటే నీ శరణాగతి మిన్న అని తెలుసుకున్నాను," అంటూ పరమ పవిత్రమైన భక్తితో ఆ పరమాత్ముడికి పూర్తిగా ఆత్మసమర్పణ చేసుకున్నాడు. అధర్మపు మార్గాన్ని వీడి, భగవత్ తత్త్వాన్ని గ్రహించిన ఆ రాక్షసుడి ఆత్మ, సచ్చిదానంద రూపంలో ఆ స్వామి పాదారవిందాలలో శాశ్వతంగా లీనమైపోయింది.

సరిగ్గా అదే క్షణంలో... **భవిష్యత్తు కాలసూరుడి** శరీరం మెల్లగా కాంతిగా మారి, గాల్లో కలిసిపోతూ పూర్తిగా మాయమైపోయిందివాడి ఆత్మకు శాంతి లభించింది. గత కాలపు

కాలసూరుడు మరణించాక, హనుమంతుడి చేతిలో దెబ్బతిని హిమాలయాలకు ఎగిరిపోవడం అనేది కాలచక్రం ప్రకారం లంకాయుద్ధంలో అంతకుముందే జరిగి ఉన్నందున, ఇప్పుడు భవిష్యత్తు కాలసూరుడి ఉనికి పూర్తిగా ముగిసింది.

యుద్ధం ముగిసాక, శ్రీరాముడు ఏకాంతంగా తన శిబిరంలో యోగసమాధిలో ఉన్న భవిష్యత్తు హనుమంతుడి వద్దకు స్వయంగా వచ్చాడు. రాముని అడుగుల చప్పుడుకు హనుమంతుడు కళ్ళు తెరిచాడు. స్వామి ముఖంలో విజయోత్సాహం, కరుణ కనిపిస్తున్నాయి. "ఆంజనేయా, లేము!" అన్నాడు రాముడు ప్రేమగా. "కాలసూరుడి అంతం ముగిసింది. ధర్మ రక్షణ జరిగింది. నీ కర్తవ్యం పరిపూర్ణమైంది. ఇక ఈ అంగుళీకంతో నువ్వు తిరిగి నీ కాలానికి ప్రయాణమవ్వు. నా ఆశీస్సులు నీకు ఎల్లప్పుడూ ఉంటాయి."

హనుమంతుడు వెళ్లేముందు మనసులోని ఒక సందేహాన్ని అడిగాడు. "ప్రభూ! అంతా బానే జరిగింది. కానీ... ఒకవేళ వర్తమానంలో ఆ కాలసూరుడిని పట్టుకునే ప్రయత్నంలో నేను ఓడిపోయి ఉంటే? అని అడిగాడు. శ్రీరాముడు మందహాసం చేశాడు. ఆ నవ్వులో అనంత విశ్వపు రహస్యం దాగి ఉంది.

"ఆంజనేయా! అంత చిన్న కాలసూరుడి కోసం నేను కాలంలో ప్రయాణించాల్సిన అవసరం లేదు. కానీ... ఒకవేళ నా

భక్తుడైన నీకు ప్రమాదం వాటిల్లితే, ధర్మానికి హాని కలిగితే... ఆ ధర్మాన్ని నిలబెట్టడానికి, నీ కోసం నేను స్వయంగా కాలచక్రాన్ని దాటి, ఏ కాలానికైనా ప్రయాణించి వచ్చేవాడిని!"

రాముడి మాటలకు హనుమంతుడి కళ్ళు ఆనందబాష్పాలతో నిండాయి. శ్రీరామ చంద్రుని పాదాలకు నమస్కరించి, అంగుళీకం సహాయంతో హనుమంతుడు మళ్లీ తన కాలానికి (భవిష్యత్తుకు) ప్రయాణమయ్యాడు. భగవంతుడు తన భక్తుడిని ఎప్పటికీ విడువడనే నమ్మకం హిమాలయాల అంతటా ప్రతిధ్వనించింది.

యుగాలు మారినా, కాలచక్రం ఎన్ని మలుపులు తిరిగినా... ధర్మం ఎప్పుడూ అధర్మంపై విజయం సాధిస్తుంది. సత్యం వైపు నిలిచే శక్తులు కాల గమనాన్ని సైతం శాసించగలవని చాటిచెప్పే ఈ కథ కేవలం పాఠకులకు సరికొత్త పఠనానుభూతిని పంచడం కోసం సృష్టించబడిన ఒక **సమకాలీన ఊహాజనిత కల్పిత కథ** మాత్రమే. వాల్మీకి మహర్షి రచించిన మూల రామాయణానికి గానీ, ఇతిహాస గ్రంథాలకు గానీ ఈ కథకు ఎటువంటి ప్రత్యక్ష సంబంధం లేదు. కేవలం అధర్మంపై ధర్మం సాధించే విజయాన్ని ఒక వినూత్న కోణంలో చూపించే ప్రయత్నం ఇది.

**శుభం**